


కాకతీయ క్లాత్ స్టోర్స్ నుంచి బయటకు వచ్చింది స్వర్ణ. చేతిలోని పాకెట్‌ను అపురూపంగా గుండెకు హత్తుకుంటూ ముందుకు నడిచింది. 'ఇప్పుడు ముకుంద్ ఏం చేస్తున్నాడో' అన్పించింది క్షణ కాలం.

'ఏం చేస్తుంటాడు — బిజీ ... తను గుర్తుంటుందా ఏమిటి?' ఇంకేదో అనుకోబోయి మానేసింది. అతను ఎప్పుడూ తన కళ్ళ ఎదురుగా వుండాలని ఎంత తపన. అతనిపై మితిమీరిన ప్రేమ వుండడంతో తనకు అన్ని విషయాల్లో అనుకూలంగా వుండడని ఏదేదో అంటూ, ప్రవర్తిస్తూ ఎంతగా బాధపెడుతుంది అతన్ని. నిజానికి అతనంటే తన కెంతో గౌరవం, మరెంతో ప్రేమ.

త్వరలో పెళ్ళి చేసుకోబోతున్న అతనికి ఏవేవో చిరుకానుకలు ఇవ్వడం ఎప్పటి నుంచో అలవాటు. అతను వాడే ప్రతి వస్తువు తనే కొనిస్తుంటుంది. ఇన్నాళ్ళు జాబ్ లేదని అతను పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చాడు. ఈ మధ్యనే గవర్నమెంట్ జాబ్ రావడంతో ప్రైవేట్ ఉద్యోగానికి స్వస్తి పలికాడు. తను ఎంతగానో బతిమాలి అతన్ని పెళ్ళికి ఒప్పించింది.

"ఇప్పుడే గదా నా సమస్యలు తీరాయి. మరో ఏడాది కాస్త రిలాక్స్‌గా గడిపి తర్వాత చేసుకుందాం" అని అతనంటాడు.

"అలా వీల్లేదు. వచ్చే నెల మన పెళ్ళి" అని తను అంటుంది. మొత్తం మీద సరేనన్నాడు. వారం రోజుల క్రితం ఊరెళ్ళినప్పుడు చిరిగిన లుంగీ కట్టుకుని కన్పిస్తే తనకెంతో చిరాకేసింది. కోపంలో ఏదేదో అనేసింది కూడా. నవ్వి వూరుకున్నాడే తప్ప ఏమనలేదు అతను. మళ్ళీ వారం తర్వాత ఊరెళ్ళాలి అనుకుని ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ షాప్‌లో ఖరీదైన రెండు లుంగీలు కొన్నది. రెండు విడివిడి కవర్లలో వుంచమని మరో పెద్ద కవర్ అడిగి అందులో రెండు లుంగీలు వుంచింది. ఒకటే తెచ్చానని చెప్పి అతను చూస్తున్నప్పుడు మరొకటి చూపించాలని తన ఆలోచన.

ప్లీజ్. ఇంకోసారి ఇలా తేకు అని మాత్రం ఎప్పటిలా అనడు అంటే తను ఊరుకుంటుం దేమిటి?

దూరంగా వస్తున్న సిటీ బస్‌ను చూసి పరుగెత్తింది.

* * *

అన్నం తినాలన్పించలేదు స్వర్ణకు. నిద్రపోదా మన్నా నిద్ర రావడం లేదు. తన ధ్యాసంతా సిటీ బస్‌లో పోయిన ఆ రెండు లుంగీల మీదనే. ఎంత ఇష్టంగా కొన్నది వాటిని. ప్చ్. తను పాకెట్‌లో అలా వుంచినా బాగుండేది. తీసి మరోసారి మరోసారి ఇలా ఎన్నోసార్లు చూసింది. హాండ్‌బాగ్, కూరల బుట్ట తప్ప ఇంకేమీ లేవు. హాండ్ బాగ్ చాలా చిన్నది. కూరల బుట్టలో పైన ఆకు కూరలు వుండడంతో పాకెట్ తడుస్తుందని చేతిలోనే పట్టుకుంది. విడివిడిగా ఒడిలో వుంచుకుంది. కండక్టర్ టికెట్ అడిగి నప్పుడు కూడా వున్నాయి.

'బహుశా ఆ పిల్ల తల్లి తన దగ్గర నిలబడి నప్పుడే పోయి వుంటాయి. అంటే... ఎత్తుకుని నిలబడడం కష్టం కాబట్టి అడిగి మరీ తీసుకుని ఒడిలో కూర్చోబెట్టుకుంది తను. అప్పుడు తను అతి సాధారణంగా ఒడిలో పాకెట్స్ ప్రక్కనే వుంచి పాపను తీసుకుంది. అలా లీలగా తనకు గుర్తు. ఛ... ఇలా జరిగిందేమిటి? కన్నీళ్ళు కూడా రాసాగాయి అదే ఆలోచన చేసి..చేసీ.

ఈ విషయం ముకుంద్‌తో చెబితే ఏమంటాడు? పెద్దగా ఆశ్చర్యపోడు. పెద్దగా నవ్వుతాడు. తనకు కోపం వచ్చి ఏదేదో అనే స్తుంది. చివరికి అంటాడు 'ఎవరికి దొరికి వుంటాయో' అని. తీసుకున్నవాళ్ళు ఎవరో తనకు తెలియకపోయినా తెగ తిట్లు తిడుతుంది తను.

'లేనివాడైతే ఆనందంగా కట్టుకుంటాడు- తల్చుకుంటాడు. ఉన్నవాడైతే... ఇంట్లోవాళ్ళని బట్టి వుంటుంది' అని అంటాడు.

'నేను ఇంతగా బాధపడిపోతుంటే నీకు నవ్వులాటగా వుంటుందా' అని నాలుగు రోజుల దాకా మాట్లాడదు తను — 'వారం రోజుల తర్వాత వారం రోజులు కల్సివుండవచ్చు తను. ముకుంద్ మూడు సిఎల్స్, మూడు శలవలు కల్సివస్తున్నాయి. మరో సండే ఓహ్' ఆనందంగా ఏదైనా తల్చుకోవాలని వున్నా ఈ బాధ ఒకటి

అనుకోకుండా వచ్చి పడింది గదా! ఛ... ఛ... ఛ... విసుగు రాసాగింది.

*　　*　　*

"బాగుంది లుంగీ ఎంతకొన్నారు?" మురిపెంగా అడిగింది శార్వాణి.

"కొనలేదు. దొరికింది."

"కర్చీఫ్ క్రింద పడితే వంగాను. సీటు క్రిందుగా కన్పించింది."

"ఛ..ఛ.. తీసి అవతల పడేయండి" విసుటుగా అంత దూరాన విసిరింది లుంగీని.

"అరెరె.. కొత్తదే గదా!"

శార్వాణిది విచిత్రమైన మనస్తత్వం. దొరికినవి ఏవీ తీసుకోదు.'దిష్టి' అని, 'తిప్పవేశార'ని ఏవేవో నామకరణాలు పెడుతూ వాటికి అంత దూరాన వుంటుంది. ఒకసారి పార్క్‌లో వంద రూపాయలు భర్తకు దొరికితే దొరికినందుకు మురిసిపోతుంటే అతని చేతి నుంచి లాక్కుని ప్రక్కనే వున్న గుడి హుండీలో వేసి వచ్చింది. అలా చాలా సంఘటనలు జరిగాయి. భార్యతో అబద్ధం చెప్పే మనస్తత్వం అతనిది కాదు. సాయంత్రమయ్యేసరికి ప్రక్కింటి వదినగారికి చేరింది లుంగీ విషయం.

ఆ రాత్రి మాటల సందర్భంలో అడిగాడు ప్రక్కింటి అతను "లుంగీ దొరికిందట గదా.. సాయంత్రం చూశాను ఖరీదైనదే.."

కోపంతో వూగిపోయాడు అతను. భార్యపై చిరాకు పడ్డాడు. మొండిగా ఆవిడ వద్దంటున్నా అంతకంటే మొండిగా తీసి కట్టుకున్నాడతను.

*　　*　　*

"అదీ విషయం."

"సీటు మీద ఎలా వుందండీ?"

"వాళ్ళెవరో వెళ్ళిపోయారు. నేను కూర్చున్నాను. నన స్టేజిలో దిగబోతుంటే 'మాష్టారూ ఇది మర్చిపోతున్నారు' అంటూ పిలిచి మరీ అందించాడు ఎవరో ఒకతను. వాడే అన్నట్టుగా పోజు పెట్టి తీసుకున్నాను."

"పోనీలెండి. ఆ ఒక్క లుంగీతోనే వెళ్ళదీస్తున్నారు. అదీ పాతగా అయిపోయింది. మంచి సమయంలో భలేగా దొరికింది" తెగ సంబరపడిపోయింది ఆవిడ.

"ఆ ... అంతే అంటావ్. నువ్వు లుంగీ కొనే ఖర్చు తప్పిందని. పారేసుకున్నవాళ్ళు ఎంతగా బాధపడుతున్నారో?"

"ఉన్నవాళ్ళే అయి వుంటారు. అందుకే అంత నిర్లక్ష్యం" అంటూ కలర్, ప్రింటును మెచ్చుకోసాగింది. అతనికీ చెప్పలేనంత సంతోషంగా వుంది. కానీ భార్య ఎదురుగా అతిగా సంబరపడిపోవడం అంత బాగుండదేమో అని బాధపడి పోతున్నట్టుగా "మన లాంటివాళ్ళు కాకూడదని ఏమ...ది?" అన్నాడు.

"మన[illegible] ళ్ళ అంత ఖరీదైనవి కొంటా[illegible] ను. ఏదో తప్పు చేసినట్టు మీరేమిటి [illegible]గా బాధపడిపోతున్నారు. హాయిగా కట్టుకోక" అంటూ భర్తపైకి విసరింది లుంగీని.

అబగా అందుకుని ఆత్రంగా చుట్టబెట్టుకుని పాత నిలువుటద్దంలో చూసుకున్నాడతను.

*　　*　　*

రేపే తను ఊరెళ్ళేది. మరో రెండు లుంగీలు తీసుకుంటే... ప్చ్.. డబ్బు సరిపోదు" ముకుంద్‌కు ఏదో ఒకటి తీసికెళ్ళాలని మనసులో బలంగా అన్పిస్తుంటే నడుచుకుంటూ సెంటర్ దాకా వచ్చింది.

చిన్న బాబును చేతిలో పట్టుకుని కూరలు కొంటున్న అతన్ని చూసి అలాగే ఆగిపోయింది స్వర్ణ. 'అదే... అదే... తను ముకుంద్ కోసం కొన్న లుంగీ. గ్యారంటీగా అదే' తర్జన- భర్జన అయింది మనసు. కూరలు కొనుక్కుని తాపీగా వెళ్ళిపోతున్న అతన్ని ఏదో ఒకటి అడగాలని ఆరాటం. అతనే మనుకుంటాడో అన్న సందిగ్ధం. చాలా కూల్‌గా వెళ్ళిపోయాడతను. అటే చూడడం తప్ప మరేం చేయలేకపోయింది స్వర్ణ.

మరికాస్త దూరం నడిచి ఆగిపోయింది. స్వర్ణ మూడ్ ఆఫ్ అయిపోయింది. వెనక్కు వెళ్దామని వెనుదిరిగింది. ఇంటికి వెళ్ళాలనిపించక ఫ్రెండ్ శిరీషను కలిసివస్తేనన్నా కాస్త మనసు ప్రశాంతంగా వుంటుందేమో అనుకుంటూ రెండు వీథులు దాటి మూడో వీథిలోకి అడుగు పెట్టింది. మూల మీదనే వున్న ఇంట్లోకి నడవబోయి ఆగిపోయింది.

"ఛీ..ఛీ.. పాడు లుంగీ. దీన్ని పట్టుకుని వేళ్ళాడుతున్నారు. పాపిష్టి లుంగీ కొనుక్కోలేమా ఏమిటి? ఆయన మాటల పద్ధతి చూస్తుంటే నా కేదో అనుమానంగానే వుంది. చూడు రత్తీ ఈ ముక్కలన్నీ పట్టుకెళ్ళి ఆ చెత్తకుండీలో వేసిరా' హుంకరించి లోపలికి వెళ్తున్న ఆవిడను పీలికలుగా అయిపోయిన కొత్త లుంగీ తాలూకు ముక్కలను త్వరత్వరగా ఏరుతున్న పనమ్మాయిని నిలువుగుడ్లేసుకుని అలాగే చూడసాగింది స్వర్ణ.

"హాయ్ స్వర్ణా! ఏమిటి అక్కడే నిలబడిపోయావ్? రా..రా.. ఇల్లు త్వరగా తెల్సుకున్నావా? బాగానే వెతికావా? అయినా నీతో చెప్పాను రెండు వీథులు దాటి మూడో వీథిలో మొదటి ఇల్లే అని" ఫ్రెండ్ ఆనందంగా ఆహ్వానిస్తుంటే తెప్పరిల్లింది స్వర్ణ.

"వీళ్ళు..."

"నాలాగే ఈ మధ్యనే వచ్చారట. కొంపలో ఎప్పుడూ గోలే. విచిత్ర విషయం ఏమిటంటే — అతనికో లుంగీ దొరికిందట సిటీబస్‌లో..!"

వినాలనిపించలేదు స్వర్ణకు. కానీ తప్పడం లేదు. శిరీష చెబుతూనే వుంది గుసగుసగా.

రత్తి వచ్చింది ఖాళీ చేతులతో.

---

రుచి

## పొట్లకాయ హల్వా

కావలసిన పదార్థాలు: కోరిన పొట్లకాయ- 2 కప్పులు, పాలు(చిక్కనివి)- 2 కప్పులు, పంచదార-1 కప్పు, డాల్డా 3 టీ స్పూనులు, జీడి పప్పు, కిస్‌మిస్ తగినన్ని, చిరంజి, సారపప్పు(కావాలి అనుకుంటే వేసుకోవచ్చు)

చేయు విధానము: పాలతో పంచదార లేని కోవా చేసి పెట్టుకోవాలి. పొట్లకాయ కత్తితో పైపొట్టు గీకి, నిలువుగా రెండుగా చీరి, లోపలి గింజలు తీసివేసి, కొబ్బరికోరుతో కోరుకోవాలి. ఈ కోరిన పొట్లకాయ 2 కప్పులు తీసుకొని, దానికి 2 కప్పులు నీళ్ళు పోసి, బాగా ఉడికించాలి. మెత్తగా ఉడికిన తర్వాత అందులో ఇంకా నీళ్ళుంటే చేతితో తీసుకొని పిసికి నీళ్ళు తీయాలి. (ఈ నీరు కూరలో వేసుకోవచ్చు). పొయ్యి మీద బాణలిపెట్టి, డాల్డా వేసి, అందులో జీడిపప్పు, కిస్‌మిస్, చిరంజి, సారపప్పు వేయించి వేరుగా పెట్టుకోవాలి. అదే బాణలిలో మిగిలిన డాల్డాలో ఈ పొట్ల కాయ గుజ్జువేసి, కాస్సేపు వేయించి తీయాలి.

వేరే గిన్నెలో పంచదార వేసి, కాసిన్ని నీళ్ళు పోసి, తీగపాకం పెట్టుకోవాలి. అందులో ఈ పొట్ల కాయ గుజ్జువేసి, ఇంకా కాస్సేపు వేడి చేయాలి. దించిన తర్వాత అందులో తయారు చేసి పెట్టుకున్న పాలకోవా, వేయించి వుంచుకున్న జీడిపప్పు కిస్‌మిస్ కలుపుకోవాలి.

ప్రయత్నించి చూడండి పొట్ల కాయతో చేసినట్టు ఎవ్వరూ కనిపెట్టలేరు.

—డాక్టర్ షహనాజ్ బతుల్